పారదర్శక పాలన సీఎం వైఎస్ జగన్‌కే సాధ్యం

పొన్నూరు ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య



సదస్సులో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య

పొన్నూరు(చేబ్రోలు): రాష్ట్రంలో సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతీ ఒక్కరికి అందిస్తున్నామని, మధ్యవర్తుల ప్రమేయం లేకుండా పారదర్శకమైన పరిపాలన అందించడం ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికే సాధ్యమైందని పొన్నూరు ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య అన్నారు. పొన్నూరు పట్టణంలోని గోవాడ పంక్షన్ హాలు, పొన్నూరు రోటరీ క్లబ్‌లో వివిధ గ్రామాలకు చెందిన గృహ సారథులు, వలంటీర్లు, సచివాలయ కన్వీనర్లకు శనివారం 'మా నమ్మకం నువ్వే జగన్' కార్యక్రమంపై అవగాహన సదస్సు జరిగింది. ఈ కార్యక్రమాల్లో ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య పాల్గొని, మాట్లాడారు. సచివాలయ కన్వీనర్లు, వలంటీర్లు, గృహ సారథులు తమకు అప్పగించిన బాధ్యతలను అంకితబావంతో నిర్వహించాలని సూచించారు. పార్టీ పటిష్ఠతకు ప్రజలతో మమేకం కావాలన్న లక్ష్యంతోనే కన్వీనర్లు, గృహ సారథుల నియామకం జరిగిందని గుర్తుచేశారు. నియోజకవర్గ పరిధిలో రూ.1500కోట్ల నగదు సంక్షేమ పథకాలు కింద లబ్ధిదారుల ఖాతాల్లో జమ అయ్యిందని వెల్లడించారు. విద్యాభివృద్ధికి నాడు –నేడు, అమ్మ ఒడి, జగనన్న విద్యాదీవెన, విద్యాకానుక, ఫీజు రీయింబర్స్‌మెంట్ వంటి పథకాలను అమలు చేస్తున్నట్లు చెప్పారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ ముఖ్యమంత్రి అయ్యేలా ప్రతి ఒక్కరూ సమన్వయంతో పనిచేయాలని పిలుపునిచ్చారు. గత టీడీపీ ప్రభుత్వం జన్మభూమి కమిటీల పేరుతో అవినీతి, అక్రమాలకు పాల్పడిందని విమర్శించారు. ప్రతి పని పచ్చచొక్కాలకే పరిమితం చేశారని ఎమ్మెల్యే దుయ్యబట్టారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ కర్లపూడి రమేష్, ఎంపీపీ భవనం పద్మలీల, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

విద్య, వైద్యంపై ముఖ్యమంత్రి ప్రత్యేక దృష్టి

రాష్ట్రంలో విద్య, వైద్యం, వ్యవసాయం అభివృద్ధికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన కార్యక్రమాలపై వేలెత్తి చూపే అవకాశం ప్రతిపక్షాలకు లేదని పొన్నూరు ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య అన్నారు. పొన్నూరులోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో శనివారం ఆయన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. చంద్రబాబు నాయుడు కుట్రలు, కుతంత్రాలతో ఎల్లో మీడియాను అడ్డుపెట్టుకొని ప్రజలను మభ్యపెట్టి మోసం చేయాలని చూస్తున్నారని విమర్శించారు. సంక్షేమమే ధ్యేయంగా అభివృద్ధి పనులు చేస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేపడుతున్న కార్యక్రమాలు దేశంలోని అన్ని రాష్ట్రాలకు ఆదర్శంగా నిలుస్తున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ కర్లపూడి రమేష్, ఎంపీపీ భవనం పద్మలీల తదితరులు పాల్గొన్నారు.

అద్భుతాలు సృష్టించే దిశగా విద్యార్థుల ఆలోచనలు ఉండాలి

ముగిసిన ఆర్‌వీఆర్ జేసీ కళాశాల వార్షికోత్సవాలు



విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేస్తున్న యాజమాన్యం

గుంటూరు రూరల్: అద్భుతాలు సృష్టించే దిశగా ఇంజినీరింగ్ విద్యార్థుల ఆలోచనలు ఉండాలని టీసీఎస్ వైస్ ప్రెసిడెంట్ గ్లోబల్ ఆర్ఎంజీ హెడ్ ఈఎస్ చక్రవర్తి పేర్కొన్నారు. రెండు రోజులుగా చౌడవరం గ్రామంలోని ఆర్‌వీఆర్ జేసీ ఇంజినీరింగ్ కళాశాలలో జరుగుతున్న 38వ వార్షికోత్సవ వేడుకలు శనివారంతో ముగిశాయి. ముగింపు వేడుకల్లో ముఖ్య అతిథిగా పాల్గొన్న చక్రవర్తి మాట్లాడారు. ప్రతి విద్యార్థికి తల్లే తొలి గురువని చెప్పారు. విద్యార్థులు సమాచార నైపుణ్యాన్ని అభివృద్ధి చేసుకుంటూ.. ప్రాంతీయ భాషలతో పాటు.. ఇతర భాషలపై పట్టు సాధించినప్పుడే విజయావకాశాలు త్వరితగతిన చేరువవుతాయన్నారు. కళాశాల అధ్యక్షుడు డాక్టర్ ఆర్.శ్రీనివాస్ కళాశాల వార్షిక ఫలితాల నివేదికలను వివరించారు. తల్లిదండ్రుల ఆశలు నెరవేరుస్తూ.. విద్యార్థి ఉజ్వల భవిష్యత్తే లక్ష్యంగా కళాశాల యాజమాన్యం, సిబ్బంది పనిచేస్తుందని సెక్రటరీ కరెస్పాండెంట్ ఆర్ గోపాలకృష్ణ స్పష్టం చేశారు. అనంతరం వివిధ విభాగాల్లో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు, సర్టిఫికెట్లు, మెమెంటోలను అతిథులు అందజేశారు. అతిథులను కళాశాల యాజమాన్యం సత్కరించింది. సీఎస్‌బీఎస్ విభాగానికి సంబంధించిన బ్రోచర్‌ను ప్రిన్సిపల్ డాక్టర్ కె.శ్రీనివాస్, విభాగాధిపతి డా. ఎంవీపీ చంద్రశేఖర్ రావు ఆవిష్కరించారు. విద్యార్థుల సాంస్కృతిక, జానపద నృత్య, కళా ప్రదర్శనలు అలరించాయి. ఈ కార్యక్రమంలో కళాశాల ట్రెజరర్ డాక్టర్ కె.కృష్ణప్రసాద్, తెలుగు చలన చిత్ర నటుడు, పూర్వ విద్యార్థి కాకాని ధర్మమహేష్, కళాశాల ఉపాధ్యక్షుడు జాగర్లమూడి మురళీ మోహన్, పాలక మండలి సభ్యులు పి.గోపీచంద్, రంగారావు, కళాశాల అకడమిక్ అండ్ ఆర్‌డీ డైరెక్టర్ డాక్టర్ కె.రవీంద్ర, డైరెక్టర్ ఫైనాన్స్ అడ్మినిస్ట్రేషన్ డాక్టర్ ఎస్‌వీ శ్రీనివాస రావు, కళాశాల డీన్, వివిధ శాఖల విభాగాధిపతులు, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

కష్టపడే తత్వం అలవాటు చేసుకోవాలి



విద్యార్థికి సర్టిఫికెట్ అందజేస్తున్న ప్రవీణ్‌కమత్‌కుంబ్లే

గుంటూరు రూరల్: విద్యార్థి దశ నుంచే కష్టపడే తత్వం అలవాటు చేసుకోవాలని విప్రో సంస్థ సీనియర్ హెచ్‌ఆర్ మేనేజర్ ప్రవీణ్ కమత్‌కుంబ్లే పేర్కొన్నారు. శనివారం నగర శివారులోని లాం నందున్న చలపతి ఇంజినీరింగ్ కళాశాలలో వివిధ కంపెనీలు విద్యార్థుల నుంచి ఆశించే నైపుణ్యాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా కుంబ్లే మాట్లాడుతూ పోటీ ప్రపంచానికి అనుగుణంగా విద్యార్థులు నాయకత్వ లక్షణాలు అలవరుచుకోవాలన్నారు. ప్రతి విద్యార్థిలో అంతర్గతంగా దాగి ఉన్న ప్రతిభా పాటవాలను ఉపాధ్యాయులు గుర్తించి, వెలికితీయాలని సూచించారు. గత విద్యా సంవత్సరంలో వివిధ విభాగాల్లో అధిక మార్కులు సాధించిన విద్యార్థులకు బహుమతులు, సర్టిఫికెట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎం చంద్రశేఖర్, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ కె.కిరణ్‌కుమార్ తదితరులున్నారు.

నూతన అధ్యయనాలపై అవగాహన

గుంటూరు రూరల్: వాతావరణ మార్పుల వల్ల మానవ శరీరంలో కలిగే మార్పులను, నూతన వ్యాధులను నిర్ధారించేందుకు నూతన ఆవిష్కరణలను పెంపొందించడం జరుగుతుందని చలపతి ఫార్మసీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్.రామారావు తెలిపారు. శనివారం నగర శివారులోని లాం నందున్న కళాశాలలో న్యూక్లియర్ మ్యాగ్నటిక్ రీసోనెన్స్(ఎన్ఎంఆర్) స్పెక్ట్రోస్కోపి అనే పరికరం, రోగ నిర్ధారణ, ఔషధాల విశ్లేషణపై విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్యాతిథులను కళాశాల యాజమాన్యం సన్మానించింది. ఈ కార్యక్రమంలో బెంగుళూరుకు చెందిన ఆంజీన్ ఆంకాలజీ లిమిటెడ్ శాస్త్రవేత్త ఎం.త్రినాథ్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

2030 నాటికి ఈవీ ఇండస్ట్రీలో 50 మిలియన్ ఉద్యోగాలు

ఏపీ ఇన్వెస్ట్‌మెంట్స్ అండ్ ప్రమోషన్స్ హెడ్, ఆటో అండ్ ఎలక్ట్రిక్ వెహికల్స్ సెక్టార్ లీడ్ రాజీవ్ కుమార్ వైఎస్సార్



చేబ్రోలు: 2030 సంవత్సరం నాటికి ఈవీ (ఎలక్ట్రిక్ వెహికల్) ఇండస్ట్రీలో 50 మిలియన్ ఉద్యోగాలు క్రియేట్ చేయబడుతాయని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఇన్వెస్ట్‌మెంట్స్ అండ్ ప్రమోషన్స్ హెడ్, ఆటో అండ్ ఎలక్ట్రిక్ వెహికల్స్ సెక్టార్ లీడ్ రాజీవ్ కుమార్ వైఎస్సార్ అన్నారు. చేబ్రోలు మండలం వడ్లమూడి విజ్ఞాన్ యూనివర్సిటీలో లేటెస్ట్ ట్రెండ్స్, ఫ్యూచర్ ప్రాస్పెక్ట్స్ అండ్ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ ఆపర్చునిటీస్ ఆఫ్ ఎలక్ట్రిక్ వెహికల్ టెక్నాలజీస్ అనే అంశంపై ప్రత్యేక అతిథి ఉపన్యాస కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రాజీవ్ కుమార్ వైఎస్సార్ మాట్లాడుతూ దేశంలో రోజురోజుకు పెరిగిపోతున్న జనాభాతో పాటు ఎలక్ట్రిక్ వెహికల్స్ వినియోగం పెరిగిందన్నారు. ప్రస్తుతం ఇండస్ట్రీలకు ఎలక్ట్రిక్ వెహికల్స్‌లలో వినియోగించే టెక్నాలజీలపైన అనుభవం కలిగిన వారు తక్కువగా ఉండటం ప్రధాన సమస్యగా మారిందన్నారు. విద్యార్థులు ఎలక్ట్రిక్ వెహికల్స్‌లో వినియోగించే టెక్నాలజీల మీద పట్టు సాధించినట్లెతై ఉజ్వల భవిష్యత్ ఉంటుందన్నారు. 2026 సంవత్సరం కల్లా ఇండియన్ ఆటోమొబైల్ రంగం బిజినెస్ 300 యూఎస్ బిలియన్ డాలర్లకు చేరుకుంటుందని తెలిపారు. విదార్థులు కేవలం ఉద్యోగాలకే పరిమితం కాకుండా స్టార్టప్‌ను మొదలుపెట్టి ఎంటర్‌ప్రెన్యూర్స్‌గా కూడా ఎదగాలన్నారు. కార్యక్రమంలో ఆయా విభాగాల డీన్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌లో 81 కేసుల పరిష్కారం



పొన్నూరు జూనియర్ సివిల్ జడ్జి ఎం.సత్యకుమారి

పొన్నూరు(చేబ్రోలు): పొన్నూరు న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో స్థానిక కోర్టు ఆవరణలో జరిగిన జాతీయ లోక్ అదాలత్ లో శనివారం 81 కేసులు పరిష్కరించినట్లు న్యాయసేవాధికార సంస్థ చైర్మన్, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ఎం.సత్యకుమారి తెలిపారు. క్రిమినల్ కేసులు 45, సివిల్ కేసులు 17, ఎన్ఐ యాక్ట్ కేసులు 2, బ్యాంక్ పీఎల్‌సీ కేసులు 15, రెండు ఎస్‌టీసీ కేసులు పరిష్కరించినట్లు తెలిపారు.

ప్రత్తిపాడు ఏఎంసీ చెక్‌పోస్టు ప్రారంభం



యార్డ్ పాలకవర్గం సభ్యులతో చైర్‌పర్సన్ మెట్టు రాజేశ్వరీ తదితరులు

గుంటూరు రూరల్: ప్రత్తిపాడు వ్యవసాయ మార్కెట్ యార్డ్ నూతన చెక్‌పోస్ట్‌ను ఏటుకూరు బైపాస్ సమీపంలో చైర్‌పర్సన్ మెట్టు రాజేశ్వరీ శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎమ్మెల్యే మేకతోటి సుచరిత ఆదేశాల మేరకు చెక్‌పోస్ట్ ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. మరొక చెక్ పోస్ట్‌ను త్వరలో మిర్చియార్డు వై జంక్షన్ వద్ద ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఇప్పటికే సంబంధిత కమిషనర్ ఆదేశాల కోసం సమాచారం అందజేసినట్లు వెల్లడించారు. గతేడాది ఏర్పాటు చేసిన ఏటుకూరు చెక్‌పోస్ట్ ద్వారా రూ.90 లక్షలకు పైగా ప్రభుత్వానికి ఆదాయం వచ్చిందన్నారు. యార్డుకు గతేడాది రూ.2 కోట్ల మేర ఆదాయం వచ్చిందన్నారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ మెరిగల రవి, డైరెక్టర్లు బాపతు వెంకటరమణ, ముత్యాల రాజు, ఖాసీం ఫీరా, తురకపాలెం సొసైటీ చైర్మన్ తంగెళ్ల నాగేశ్వరరావు, ఆర్అండ్‌బీ కార్పొరేషన్ డైరెక్టర్ పిల్లి మేరి, వైఎస్సార్ సీపీ సేవాదళ్ జిల్లా అధ్యక్షుడు మెట్టు వెంకటప్పారెడ్డి, కందుకూరి జ్యోతి, అధికారులు, సిబ్బంది తదితరులున్నారు.

బస్సు ఢీకొని యువకుడి మృతి



మరణించిన నలుకుర్తి నాని

చేబ్రోలు: ఆర్టీసీ బస్సు ద్విచక్ర వాహనాన్ని ఢీ కొన్న ఘటనలో..ఓ యువకుడు అక్కడికక్కడే మరణించగా మరో యువకుడికి తీవ్రంగా గాయపడ్డాడు. ఈ ఘటన మండలంలోని నారాకోడూరు వద్ద శనివారం జరిగింది. వివరాల మేరకు.. నారాకోడూరు దళితవాడకు చెందిన నలుకుర్తి నాని, కోడూరు విజయ్‌చంద్ర గ్రామంలోని బంధువులు పెళ్లి పనుల నిమిత్తం ద్విచక్ర వాహనంపై వస్తున్నారు. గుంటూరు నుంచి తెనాలి వెళ్తున్న ఆర్టీసీ బస్సు వారిని ప్రమాదవశాత్తు ఢీకొట్టింది. ఈ ఘటనలో నలుకుర్తి నాని(33) అక్కడికక్కడే మరణించాడు. తీవ్ర గాయాలైన కోడూరు విజయ్‌చంద్రను 108 వాహనం ద్వారా గుంటూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ఇద్దరూ దినసరి కూలీలుగా పనిచేస్తున్నట్లు సమాచారం. చేబ్రోలు పోలీసులు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించారు.

అరటితోటలో కుళ్లిపోయిన మహిళ మృతదేహం



మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

పొన్నూరు(చేబ్రోలు): మండలంలోని చింతలపూడి గ్రామ పరిధిలో ఉన్న అరటితోటలో శనివారం గుర్తు తెలియని మహిళ మృతదేహం కలకలం సృష్టించింది. వడ్డిముక్కల రోడ్డులో చింతలపూడి గ్రామానికి చెందిన పి.వీరయ్యకు కౌలుకు చేస్తున్న అరటితోటలో మహిళ మృతదేహాన్ని గుర్తించారు. సుమారు 25 నుంచి 35సంవత్సరాల వయస్సు కలిగిన మహిళ మృతదేహం పూర్తిగా కుళ్లిపోయిన స్థితిలో ఉండి గుర్తు పట్టడానికి వీలు లేని విధంగా ఉంది. స్థానిక వీఆర్వో ఫిర్యాదు మేరకు పొన్నూరు రూరల్ పోలీసులు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నారు. మృతురాలికి సంబంధించిన సమాచారం తెలిసినవారు స్థానిక పోలీసులను సంప్రదించాలని పోలీసులు తెలిపారు.

ఆటోను ఢీకొన్న బస్సు.. మహిళలకు గాయాలు



108 వాహనంలో గాయపడిన మహిళ

వెల్లలూరు(చేబ్రోలు): మిరపతోటలో పనులకు వెళ్లిన మహిళా కూలీలను తీసుకొస్తున్న ఆటోను ఆర్టీసీ బస్సు ఢీ కొట్టడంతో నలుగురికి తీవ్ర గాయాలైన ఘటన శనివారం మండలంలోని వెల్లలూరు గ్రామ సమీపంలో జరిగింది. చుండూరు మండలం మోదుకూరు గ్రామానికి చెందిన పదిమంది మహిళా కూలీలు వట్టిచెరుకూరు మండలంలో మిరపకోత పనులకు ఆటోలో వెళ్లారు. పనులు ముగించుకొని తిరిగి వెళ్తున్నారు. వెల్లలూరు గ్రామ సమీపంలో ఎదురుగా వచ్చిన ఆర్టీసీ బస్సు ఆటోను ఢీ కొట్టింది. ఈ ఘటనలో నలుగురు మహిళలకు గాయాలయ్యాయి. మిగిలిన వారు స్వల్పంగా గాయపడ్డారు. గాయపడిన పుట్లా నాగమ్మ, శ్యామల, అనూష, తులశమ్మను 108 వాహనంలో ప్రాథమిక చికిత్స అందించి, పొన్నూరు వైద్యశాలకు తరలించారు. రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

రేకును కోసి.. రూ.లక్ష నగదు చోరీ



జేఎస్ మార్ట్‌లో సీసీ కెమెరాలను పరిశీలిస్తున్న ఎస్ఐ ఆనంద్

చేబ్రోలు: మండలంలోని వడ్లమూడి గ్రామంలో ఉన్న జేఎస్ మార్ట్‌లో శనివారం దొంగతనం జరిగింది. వడ్లమూడి అడ్డరోడ్డు ప్రాంతంలో జై శ్రీమన్నారాయణ(జేఎస్)మార్ట్ ఉంది. షాపు పక్కన నిర్మాణ పనులు జరుగుతున్నాయి. షాపు వెనుక బాగంలో భవన నిర్మాణ పనులకు ఉపయోగించే స్టాండ్‌ను ఎక్కి అక్కడ రేక్‌ను కట్ చేసి దొంగ లోపలికి ప్రవేశించినట్లు అనవాళ్లు కనిపిస్తున్నాయి. షాపులోని సీసీ కెమెరాలో నిందితుని కదలికలు రికార్డు అయ్యాయి. కౌంటర్‌లోని సుమారు రూ.లక్ష నగదును దొంగ అపహరించుకుపోయినట్లు షాపు యజమాని శ్రీనివాసరావు ఫిర్యాదు చేశాడు. చేబ్రోలు ఎస్ఐ కె.ఆనంద్ కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నారు. గుంటూరు నుంచి క్లూస్ టీం సభ్యులు ఆధారాలను సేకరించారు.

సోషల్ మీడియా కన్వీనర్ల నియామకం

పొన్నూరు: పొన్నూరు నియోజకవర్గ సోషల్ మీడియా కన్వీనర్‌గా ఎం.వినోద్‌కుమార్‌ను నియమిస్తూ వైఎస్సార్ సీపీ కేంద్ర కార్యాలయం ప్రకటించింది. నియోజకవర్గ కో-కన్వీనర్లుగా సీహెచ్‌ఆర్ కే.మూర్తి, ఎం.కిరణ్‌కుమార్, పసుపులేటి సాయి కిరణ్‌లను నియమించారు.

- చేబ్రోలు మండల వైఎస్సార్ సీపీ సోషల్ మీడియా కన్వీనర్, నలుగురు కో కన్వీనర్లను నియమించడం జరిగింది. కన్వీనర్‌గా గొర్ల దినేష్, కో–కన్వీనర్లుగా టీఎస్ ఉదయకిరణ్, డి.జ్యోతి కుమార్, షేక్ అమానుల్లాలను నియమించారు.
- పెదకాకాని మండల సోషల్ మీడియా కన్వీనర్‌గా ఎ.సందీప్‌రెడ్డి, కో–కన్వీనర్లుగా ఎ.వీర వెంగళరావు, ఆట్ల కృష్ణారెడ్డి, తోట సాంబశివరావు, పి.దేవాలను నియమించడం జరిగింది.
- కాకుమాను వైఎస్సార్ సీపీ సోషల్ మీడియా మండల కన్వీనర్‌గా వేముల వాసు, కో–కన్వీనర్లుగా కొల్లా సురేష్, వేమూరి మోషే, వేముల రాజా రిత్విక్‌ను నియమించారు.
- గుంటూరు రూరల్ వైఎస్సార్‌సీపీ సోషల్ మీడియా కన్వీనర్‌గా పుట్టా బాజీ, మండల కో–కన్వీనర్లుగా షేక్ నాగుల్‌మీరా, పెరికల హర్షబాబు, మామిడి నాగమహేష్‌బాబు, పసుపులేటి నాగరాజు, మెడబలిమి జేసుదాస్‌ను నియమించడం జరిగింది.
- పెదనందిపాడు షోషల్ మీడియా కన్వీనర్‌గా చీమకుర్తి లోకేష్, కో– కన్వీనర్లుగా స్వర్ణ రమేష్, చెన్నుపాటి సురేష్‌బాబు, జంగం కుమార్, పల్లపు సురేష్‌బాబులను నియమించడం జరిగింది.

గ్రహణమొర్రికి ఉచిత శస్త్ర చికిత్స

పెదకాకాని: సిబార్ దంత వైద్య కళాశాలలో గ్రహణమొర్రి, అంగిలిలో చీలికకు ఉచిత శస్త్ర చికిత్స(సర్జరీ) చేయడం జరుగుతుందని కళాశాల డీన్ డాక్టర్ ఎల్.కృష్ణప్రసాద్ తెలిపారు. మండలంలోని తక్కెళ్ళపాడు కళాశాలలో ఫిబ్రవరి 13న అంతర్జాతీయ నోటి, ముఖ శస్త్ర చికిత్స దినోత్సవం పురస్కరించుకుని ఉచిత శస్త్ర చికిత్సలు నిర్వహించడం జరుగుతుందన్నారు. గ్రహణమొర్రి, అంగలిలో చీలిక చికిత్స చేయించుకునే సోమవారం నుండి 28వ తేదీ వరకూ కళాశాలలోని నోటి, ముఖ శస్త్ర చికిత్స విభాగం నందు పేరు నమోదు చేయించుకోవాలన్నారు. అలానే సోమవారం పేర్లు నమోదు చేయించుకున్న వారికి పుచ్చు, కదులుతున్న పళ్లను ఎలాంటి రుసుం లేకుండా తొలగించనున్నట్లు ఆయన తెలిపారు.

క్లుప్తంగా

తేనెటీగల పెంపకంతో అదనపు ఆదాయం

హార్టికల్చర్ డిప్యూటీ డైరెక్టర్ వీఎస్ ధర్మాజ



గుంటూరు రూరల్: తేనెటీగల పెంపకం ద్వారా రైతులకు అదనపు ఆదాయం కలుగుతుందని హార్టికల్చర్ డిప్యూటీ డైరెక్టర్ వీఎస్ ధర్మజ తెలిపారు. శనివారం వట్టిచెరుకూరు మండలం పుల్లడిగుంట నందున్న రైతు నేస్తం పౌండేషన్‌లో తేనెటీగల పెంపకంపై రైతులకు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా తేనెటీగల పెంపకం యాజమాన్య పద్ధతులు వివరించారు. పుట్టగొడుగులు, సేంద్రియ వ్యవసాయంపై రైతులకు క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించారు. సహాయ సంచాలకులు కె.శ్రీకాంత్‌రెడ్డి పాల్గొన్నారు.

చప్టా ఏర్పాటు చేయండి..



మురుగు కాలువపై విరిగిన నాపరాయి

పెదకాకాని: మండలంలోని వెనిగండ్ల గ్రామంలో చెంచుల కాలనీ వద్ద కాలువ దాటేందుకు నాపరాళ్లు వేశారు. ఈ మార్గంలో శ్మశానానికి మృతదేహాలను తీసుకెళ్లాఇ. గత వారం మృతదేహాన్ని స్మశానంలోకి తీసుకెళ్లే క్రమంలో నాపరాయి విరిగి ఒకరు అందులో పడ్డారు. కాలువపై ఏరఏర్పాటు చేసిన అధికారులు దానిపై చప్టా కట్టడం మరిచారు. కాలువపై చప్టా ఏర్పాటు చేయాలని గ్రామ ప్రజలు కోరుతున్నారు.

హిందీ భాషపై పట్టు సాధించాలి



పరీక్ష నిర్వహణను పర్యవేక్షిస్తున్న ఎంఈఓ కెనడీ

కొండపాటూరు(కాకుమాను): ప్రభుత్వ పాఠశాలల్లో విద్యనభ్యసిస్తున్న ప్రతి విద్యార్థి. ప్రాథమిక స్థాయి నుంచి హిందీ భాషపై పూర్తిస్థాయిలో పట్టు సాధించాలని ఎంఈఓ కేఎఫ్ కెనడీ కోరారు. మండలంలోని కొండపాటూరు ప్రాథమిక పాఠశాలలో (దక్షిణ భారత హిందీ ప్రచార సభ ఆధ్వర్యంలో) నిర్వహిస్తున్న హిందీ ప్రావీణ్య పరీక్షను శనివారం ఆయన పరిశీలించారు. హిందీ భాషపై అవగాహన కల్పించాలనే లక్ష్యంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఈ కార్యక్రమాన్ని అమలు చేస్తున్నట్లు ఎంఈఓ చెప్పారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం శీలం అంకారావు ఉన్నారు.

ఏ పుస్తకాలు కావాలో చెప్పండి..

కాకుమాను: కాకుమానులోని గ్రంథాలయంలో పుస్తకాలను పాఠకులు, నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని స్థానిక శాఖ గ్రంథాలయ అధికారి జోగి మోహనరావు శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వివిధ రకాల దిన, మాస, వార పత్రికలు అందుబాటులో ఉన్నాయని ఆయన తెలిపారు. నిరుద్యోగ యువతకు కాంపిటేటివ్ పుస్తకాలను త్వరలో అందుబాటులోకి తీసుకురానున్నట్లు వెల్లడించారు. పుస్తకాలు కావాల్సిన వారు తమ పేరు, వివరాలను తెలియజేస్తే ఈ నెల 14 నాటికి జిల్లా గ్రంథాలయం నుంచి తీసుకురానున్నట్లు పేర్కొన్నారు. గ్రంథాలయం అందిస్తున్న సేవలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

నేడు ఉచిత వైద్య శిబిరం

గుంటూరు మెడికల్: నటరాజ్ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక ముత్యాలరెడ్డినగర్ 7వ లైనులో ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు న్యూరాలజిస్టు డాక్టర్ పి.నటరాజ్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు బొడ్డు చంద్రయ్య నివాసం వద్ద నిర్వహించనున్న శిబిరంలో ఉచితంగా దంత, కంటి, షుగర్ పరీక్షలు చేసి మందులు కూడా ఉచితంగా అందిస్తామని పేర్కొన్నారు. అన్ని వ్యాధులకు వైద్య పరీక్షలు చేస్తారని తెలిపారు.